# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్‌ది కుట్రే..

- రైతులంటే ఎందుకింత కక్ష
- మూడు గంటల కరెంటు అంటే ముప్పు తిప్పలే
- ఎకరం పొలమైనా తడుస్తదా..?
- ఎట్లిస్తరు అని అడిగితే 10హెచ్‌పీమోటర్ పెట్టుకోవాలంటున్నరు
- ఇట్లా కరెంట్‌పై పూటకోమాట ఎందుకు మాట్లాడుతున్నరు
- మళ్లీ మా జీవితాలు నాశనం చేయడానికా..?

కరీంనగర్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్‌కు ఓటేస్తే మా బతుకులు ఆగమైతయనే విషయం మాకు అర్థమవుతుంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు రోజుకో మాట మాట్లాడుతున్నరు. మొదట్ల నేమో మూడు గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నడు. మూడు గంటల్లో మూడెకరాలు పారుతుందన్నడు. ఎన్నడైనా ఎవుసం జేసినోడైతే ఇట్లా మాట్లాడడు.. అందుకే మాకు కోపమొచ్చింది. అందరం కలసి లొల్లిలొల్లిజేసినం. ఇగ ఇప్పుడు ఎన్నికలొచ్చినయి గదా..? మళ్లీ కొత్తపాట పాడుతుండ్రు. మూడు గంటల్లో మూడు ఎకరాల పొలం ఎట్లా పారుతుందంటే.. 10 హెచ్‌పీల మోటార్లు పెట్టాలంటుండ్రు. రైతు ఎవరైనా 10 హెచ్‌పీల మోటార్లు వాడుతడా? ఒకవేళ వాడితే ఇప్పుడు పెట్టిన ట్రాన్స్ ఫార్మర్లు ఆగుతాయా? పోనీ పెట్టాల్సి వస్తే ఒక మోటారు, వాటికి కావాల్సిన పైపులు, అందుకు సరిపోయే విధంగా స్టాటర్ ఇలా అన్ని కలిపి ఒక్కో దానికి రూ.లక్ష మీదే అయితది. ఈ పైసలు ఎవరిస్తారు?. దీని మీద లొల్లి లొల్లి అయితనే ఉంది. దీన్ని జూసిన కాంగ్రెస్‌వోళ్లు ఇప్పుడు మరో మాట మాట్లాడుతుండ్రు. అట్లగాదు గానీ మేం కూడా 24 గంటల కరెంటు ఇస్తమంటుండ్రు. నెల రోజుల్లో మూడు మాటలు మాట్లాడింది జూసినం. అందుకే మేం ఆలోచన జేస్తున్నం. నిజానికి ఇప్పుడు మాకు కావాల్సినంత కరెంటు ఉంది. కేసీఆర్ వచ్చినంక ఢోకాలేకుండా పోయింది. కంటినిండా నిద్రపోతున్నం. మాకు అవసరమైనప్పుడు వెళ్లి మోటర్ పెట్టుకుంటున్నం. ఇన్ని సౌలతులుండంగా కాంగ్రెస్ ఓటు వేసి మా బతుకులు మేం ఆగం జేసుకోం. మునపటి లెక్క ఎడ్డి రైతులం కాదు. మాదాంటో చైతన్యం వచ్చింది. ఎవరేమిజేస్తుండ్రో చూస్తున్నం. ఎవరికి ఓటు ఏయాలో..? ఎవరిని దూరంగా పెట్టాలో..? మాకు తెలుసు. ఒక్క మాట జెప్పాలంటే మా బతుకుల్లో మేం మట్టి యితే పోసుకోం అంటున్నారు జిల్లా రైతులు. వ్యవసాయరంగానికి ఇచ్చే ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న డ్రామాలు, పూటకో మాట తీరుపై జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు. వారిమాట్లనే చూద్దాం.

## కాంగ్రెస్‌కు అధికారమిస్తే చీకటి రోజులే..



నాపేరు సింగిరెడ్డి రాజిరెడ్డి. మాది తంగళ్లపల్లి మండలం వేణుగోపాల్‌పూర్ గ్రామం. నాకు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక రామగోస ఎల్లదీసినం. ఎప్పుడువత్తదో.. ఎప్పుడుపోతదో తెలికుంటుండె.. వచ్చిన కరెంట్‌తో దొయ్య పారలే.. మడి తడవలే. పొయ్యి మీద బియ్యం పెట్టుకొని కడుపు నిండా కూడుతినని రోజులను యాదిచేసుకుంటనే భయమైతది. అధికారంలోకి రాకముందే మూడు గంటల కరెంటు ఇత్తమంటున్నరు. వచ్చినంక కరెంటు మొఖమన్నా సూత్తమో లేదోనన్న అనుమానం వత్తుంది. 2004లో ఇరవై బోర్లు ఏసినా సుక్కనీరు పడలే. రూ.15లక్షలు అప్పులైనయి. ఎవుసం నడవక.. అప్పులు తీరక 2004మే 5న దుబాయికి పోయిన. ఐదేండ్లయినంక వాపస్‌వచ్చిన. కేసీఆర్ అచ్చినంక కరెంటు పుల్లు ఇచ్చిండు. రెండు పంటలు పండుతున్నయి. రైతుబంధు పైసల కింద ట్రాక్టర్ కొనుక్కున్నా. ఇద్దరు కొడుకులను సౌదీకి పంపించిన. ఒక కొడుకు సాఫ్ట్‌వేర్ జాబ్ జేత్తండు. నేను ఎవుసం చేసుకుంటూ ఇక్కడే ఉంటున్న. పంట అమ్మిన పైసలు సగం లాగోడికి పోను రూ.60వేలు మిగులుతున్నయి. రందీలేదు. ఎలక్షన్ల ముందే కాంగ్రెసోళ్లు కరెంటు మూడు గంటలు సాలంటున్నరు.వాళ్లకు గనకు అవకాశం ఇస్తే మాత్రం మళ్లీ చీకటి రోజులే ఉంటయనిపిస్తుంది. ఆ రోజుల్లోనే కరెంటు ఇయ్యనోళ్లు మళ్లత్తే ఎట్లిత్తరు.

**- సింగిరెడ్డి రాజిరెడ్డి, వేణుగోపాల్‌పూర్ (తంగళ్లపల్లి మండలం)**

## మూడు గంటల కరెంటుతో మడి తడుత్తదా



నా పేరు వంగ కృష్ణారెడ్డి. మాది తంగళ్లపల్లి మండలం ఓగులాపూర్. నాకు నాలుగు ఎకరాలు ఉన్నది. నాడు రెండెకరాలే సాగుచేసిన. కరెంటు లేక వేసిన పంట ఎండిపోయి చేతికి రాలే. రాత్రిపూట కరెంటు పెట్టేందుకుపోయి మాఊళ్లే ఓ రైతు పాము కుట్టి సచ్చిపోయిండు. రాత్రనక, పొద్దనక కరెంటు కోసం బాయికాడనే ఉండేవాళ్లం. ఇగ విత్తనాలు, యూరియా కోసం చెప్పులు లైన్‌లో పెట్టి రోజంతా సిరిసిల్లలో ఎరువుల దుకాణం ముందు ఎదురుచూసినం. రైతులను చానా చులకనగా చూసిన్రు. లైనులో నిలబడితే రాత్రి అయితండే. తిందామంటే లైను తప్పుతుందని ఆకలిని చంపుకొన్నం. కడుపు కాల్చుకున్నం. ఎంత గోస ఎల్లదీసినం. కేసీఆర్ సారు ఇస్తున్న కరెంటు మంచిగత్తన్నది. పంట చేతికొస్తున్నది. ఇగ గిప్పుడు మల్ల కాంగ్రెసొళ్లు కరెంటు మీద ఏదేదో మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంటుతోటి రైతులంతా ఒక్కసారే మోటర్లు పెడితే ఏట్ల నడుత్తయి. లోవోల్టేజీ వచ్చి కాలిపోతాయి. మోటరు పట్టుకుని రిపేరుకిత్తే రోజంతా మెకానిక్ వద్దే ఉండుడైతది. తెల్లారి తీసుకొచ్చి పెడితే ఏం లాభం. అప్పుడే మూడు గంటలు సాలంటన్నరు. ఈళ్లు గిప్పుడేగిట్ల మాట్లాడుతున్నరంటే అధికారంలోకి వస్తే ఎట్లజేస్తరు. ఎన్నికల ముందే చెప్పినమని గోసగోసజేత్తరు. కర్ణాటకలో ఏమి ఎలగబెట్టిండ్రు. కనపడత లేదా? మూడు గంటలు ఇత్తే ఒక మడన్న తడుత్తదా?

***- వంగ కృష్ణారెడ్డి, ఓగులాపూర్ (తంగళ్లపల్లి మండలం)***

## ఆనాడు రైతులందరం గోసపడ్డం..



నా పేరు చదువాల మల్లయ్య. మాది ఇల్లంతకుంట. నాకు మూడెకరాలు ఉన్నది. కేసీఆర్ గవర్నమెంటు 24గంటల కరెంటు, నీళ్లు ఇత్తాన్నది. మూడెకరాలు నాటేసిన. ఉదయం, సాయంత్రం పొలానికి నీళ్లపెట్టి.. మిగతా టైంలో వేరే పనికిపోతున్న. కాంగ్రెస్ ఉన్నప్పుడైతే కరంటు సక్కగుండేదికాదు. నీళ్లు లేకుండె.. రైతులందరం గోసపడ్డం. మళ్లీ ఆ కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు ఇస్తమంటున్నరు. వాళ్లిచ్చే కరెంటుతో ఒక మడి కూడా పారది. ఆ కరెంటు కోసం పొద్దుమాపు బావులకాడనే ఉండుడు అయితది. గసొంటి కాంగ్రెస్ గవర్నమెంటు మాకొద్దు.

**- చదువాల మల్లయ్య (ఇల్లంతకుంట)**

## పొలంకాడ మల్ల గుడిసెలు వేసుకోవాలె ..



తెలంగాణ రాకముందు కరెంటు కోసం బాయిలకాడ గుడిసెలు వేసుకుని అరగంటకు ఒకసారి కరెంటు వచ్చిందా.. లేదా..అని చూసుకుంటూ అక్కడే 24గంటలు అక్కడే ఉండేటోళ్లం. వచ్చిరాని కరెంటుతో పంటలన్నీ ఎండిపోయి ఇబ్బందిపడ్డం. తెలంగాణ వచ్చినంక 24గంటల కరెంటు వత్తాంది. బాయిల కాడ గుడిసెలు పీకేసి పదేండ్లకాడికి వత్తాంది. ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడే బాయిలకాడికి పోయి కరెంటు పెట్టుకుంటున్నాం. నాకున్న రెండెకరాల్లో తెలంగాణ వచ్చినకాడి నుంచి రెండు పంటలు పండిస్తున్న. చానా సంతోషంగా ఉన్నం. మళ్లా కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు ఇస్తామంటున్నరు. మళ్లా వాళ్లు గనుక వస్తే పొలంకాడ మల్ల గుడిసెలు వేసుకోవాలె.

**-ఒరుపుల మల్లయ్య, ముస్కానిపేట (ఇల్లంతకుంట మండలం)**

## 24గంటల కరెంటుతోనే బతుకుతున్నం



బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంటుతోనే మేము బతుకుతు న్నం. రైతుల కష్టాలపై అవగాహన లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడుతాంట బాధయితాంది. నా పేరు అల్లూరి గంగారెడ్డి. మాది రుద్రంగి గ్రామం. నాకు నాలుగెకరాల ఉన్నది. గతంలో వ్యవసాయానికి నీరు లేక దుబాయ్ పోయిన. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇవ్వడంతోపాటు నీటి సౌకర్యం కల్పించడంతో గల్ఫ్ దేశం వదిలి ఊరిలో నాకు ఉన్న భూమిలో రెండెకరాల్లో వరి, మిగతాదాంట్లో జామ, కూరగాయలు సాగు చేస్తున్న. సీఎం కేసీఆర్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇవ్వడంతో రెండు పంటలు పండించుకుంటున్నం. సీఎం కేసీఆర్ వచ్చినంక రైతులకు కరెంటు కష్టాలు తీరినయ్. నాడు కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంటే ఇవ్వలేదు. కరెంటు లేక పంటలు ఎండిపోయేవి. అప్పుడు కరెంటు ఎప్పుడస్తదో అని ఎదురుచూసేటోళ్లం. కరెంటు ఎప్పుడస్తదో తెలువక పొలం కాడనే పడుకునేటోల్లు. చీకట్లో నీరు పెట్టేందుకు వెళ్లి పాము కాటు, కరెంటు షాకుతో రైతులు సచ్చిపోతుండే. రేవంత్‌రెడ్డి అన్నట్లు మూడు గంటల కరెంటు ఇస్తే గ్యాపు ఇచ్చే బోర్లతో ఎకరం కూడా పారది. కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రైతులకు మళ్లీ కరెంటు కష్టాలు మొదలైతాయి. **- అల్లూరి గంగారెడ్డి, రైతు (రుద్రంగి)**

## వామ్మో కాంగ్రెస్‌కు ఓటేయద్దు



నా పేరు చెరుకు రవీందర్‌రెడ్డి. మాది వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి గ్రామం. నాకు భూమి లేకపోవడంతో గతంలో మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పండించేవాన్ని. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మా ప్రాంతానికి ఎల్లంపల్లి కాలువ నుంచి నీళ్లొచ్చినయి. చెరువులన్నీ నింపిన్రు. మూడేండ్ల నుంచి పదెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్న. మున్నుపు పత్తి వేసినప్పుడు నీళ్ల లేక పెట్టుబడి కూడా వచ్చేది కాదు.. ఉన్నకాస్త కొద్దిపాటి నీటితో పారకం చేద్దామంటే కరెంటు ఉండేది కాదు. ఇప్పుడు పుష్కలంగా నీళ్లుండగా, పదెకరాల్లో వరి వేసిన. వడ్లన్నింటినీ మా ఊర్లనే గవర్నమెంటే కొంటాంది. ఇప్పుడు మా ఊళ్లే చానా మంది కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నరు. ఇదంతా కేసీఆర్ పుణ్యమే. మాకు కాలువలు రాకుంటే చెరువులు నిండేవి కాదు. మేము కౌలుకు తీసుకొని ఎవుసం చేసేటోళ్లం కాదు. మునుపు కాంగ్రెస్ గవర్నమెంటు ఉన్నప్పుడు మా ప్రాంతమంతా కరువు ఉండేది. మళ్లా కాంగ్రెస్‌కు తప్పిపోయి ఓటేస్తే మూడు గంటల కరెంట్‌తో గోసపడుతం. ఆ కరెంటుతో 30గుంటల మడి కూడా పారదు. మూడు గంటల కరెంటు ఇస్తాం. 10హెచ్‌పీ మోటర్లు పెడుతామంటున్న రేవంత్‌రెడ్డి అంటుండు.. ముఖ్యంగా రైతు చానా జాగ్రత్తగా ఉండాలె. కాంగ్రెస్‌కు ఓటేయద్దు.

**-చెరుకు రవీందర్‌రెడ్డి, నమిలిగుండుపల్లి (వేములవాడ రూరల్)**

## కరంటు కోసం.. మస్తు గోసపడ్డం



నాకు కొత్తపల్లి గ్రామ శివారున రెండున్నర ఎకరాల భూమి ఉన్నది. నాడు కాంగ్రెస్ గవర్నమెంటున్నప్పుడు కరెంటు కోసం మస్తుగోసపడ్డం. అచ్చిరాని కరెంటుతో ఎవుసం చేసేందుకు కష్టాలుపడ్డం. బావికాన్నే పగలనక, రాత్రనక ఉండేవాళ్లం. ఇంటికాడ ఉంటే పారిన మడి పారుతుండే.. ఇంకో మడి పారించాలంటే బావికాన్నే ఉండోటోళ్లం. తెలంగాణ వచ్చినంక 24గంటల కరంటు కేసీఆర్ సారు ఇస్తున్నడు. ఇప్పుడు రందీలేకుండా పొలం పారితున్నం. గిప్పుడు మళ్లా ఆ కాంగ్రెసోళ్లు వచ్చి మూడు గంటల కరెంటు ఇస్తామంటున్నరు. ఆ కరెంటుతో అర ఎకరమన్న పారదు. మళ్లా మూడు గంటలిస్తే గోసపడుడే.

**- జోగు చంద్రయ్య, కొత్తపల్లి (గంభీరావుపేట)**

## మూడు గంటలంటే.. 30ఏండ్లు వెనక్కిపోయినట్టే..



నా పేరు నల్మాస్ వెంకట్‌రెడ్డి. మాది ఆసిరెడ్డిపల్లి. నాకు ఐదెకరాల భూమి ఉన్నది. నాలుగెకరాల పొలంల మూడేండ్ల నుంచి ఎకరాకు 45బస్తాలు పండిస్తున్న. కాంగ్రెస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు మూడు గంటలే కరెంటు ఉండేది. బట్టకుపొట్టకు బతికేటోళ్లం. ఇప్పుడు నీళ్లు పుష్కలంగా ఉన్నయి. 24గంటల కరెంటుతో నాలుగురాళ్లు వెనకేసుకుంటున్నాం. నాలుగెకరాలల్లో వరి, ఎకరంల పత్తి వేసిన. కాంగ్రెసొళ్లు మల్ల మూడు గంటల కరెంట్ అంటే 30ఏండ్లు వెనక్కిపోయినట్టే.

**- వెంకట్‌రెడ్డి, ఆసిరెడ్డిపల్లి (చందుర్తి)**